# చిత్రాంగద

మహావీరుడైన అర్జునుడు తీర్థయాత్రలు చేస్తున్నాడు. మణిపుర మహారాజు చిత్రవాహనుడు అర్జునుడు తన పురానికి ఎప్పుడొస్తాడా అని ఎదురుచూస్తున్నాడు.

మహారాజు ఏకైక పుత్రిక చిత్రాంగద అర్జునుని వీరగాథలు విని, అతన్ని చూసే భాగ్యం ఎప్పుడు కలుగుతుందో అనుకుంటూ సమయం కోసం నిరీక్షిస్తోంది.

సకల తీర్థప్రదేశాలు సేవిస్తూ, కావేరీ నదీ ప్రాంతాన హిరణ్యదానాదులు గావించిన అర్జునుడు మిత్ర పౌరాణిక బృందాలతో మణిపురం చేరాడు. ఆ వార్త విన్న చిత్రవాహనునికి ఆనందం పట్టరానిదైంది. ఊరంతా అలంకరింపచేయ ఆజ్ఞాపించాడు.

చిత్రవాహనుని సందర్శించటానికొచ్చిన అర్జునునికి అతిథి సేవలు చేసి, కుమార్తె అయిన చిత్రాంగదను అతనికి పరిచయం చేశాడు.

చిత్రాంగదను చూడగానే చిత్రమైన అనుభూతి కలిగింది అర్జునునికి. తండ్రి పక్కన నిల్చిన ఆమె ముగ్ధమనోహర రూపం అతని మనసును వశపరచుకుంది. ఆమె సోగకళ్ళు, నల్లని కురులు ఎంత చూసినా తనివితీరనట్లే అనిపించి అర్జునుడు చూపు మరల్చుకోలేకపోయాడు.

ఇన్ని దేశాలు తిరిగాడు తను, ఇంతమంది స్త్రీలను చూశాడు. కానీ ఎక్కడా కనిపించని ఏదో ప్రత్యేకమైన ఆకర్షణ చిత్రాంగదలో కనిపించింది అర్జునునికి. సుకుమారంగా ఉన్న ఆమె ముఖంలో ఏవో వీరత్వపు ఛాయలు గోచరించాయి. ఆమె వాలుచూపుల్లోనే నిశితత్వం నిగూఢంగా ఉందనిపించింది. అపురూప లావణ్యంతో పాటు, అసాధారణమైన ప్రజ్ఞాపాటవాలు ఈమె కున్నాయనిపించింది చూస్తుంటే. ఈమెకు యుద్ధ విద్యలు తెలిసి ఉండవచ్చు. గుర్రపుస్వారీ నేర్చి ఉండవచ్చు. స్త్రీయై కూడా ఈమె పురుష విద్యలు నేర్చిందేమో?

అర్జునుడు మరీ ఆశ్చర్యంగా ఆమె వంక చూస్తుంటే, చిత్రాంగద అక్కడ నుంచి రివ్వున లోపల కెళ్ళిపోయింది. అర్జునుని పరాక్రమాన్ని గురించి వినటమే కాక, ప్రత్యక్షంగా అతన్ని చూడగలిగినందుకు చిత్రాంగదకి ఎంతో ఆనందం కలిగింది.

అర్జునుడు చిత్రవాహనుని దగ్గర సెలవు తీసుకున్నాడు. కానీ ఆ మణిపురం పదలిపోబుద్ధి కాలేదు అతనికి. తనతో వచ్చిన వారంతా ప్రయాణ సన్నాహంతో ఉంటే, అర్జునుని మనసు చిత్రాంగదపైన లగ్నమై, ప్రయాణానికి విముఖత చూపుతోంది.

తీర్థయాత్రార్థిగా వచ్చిన తను, ఈ మణిపురంలో చిత్రాంగదను ప్రేమిస్తూ ఇక్కడే ఆగిపోవటమా? - అర్జునుడు ఎంత వితర్కించుకున్నా అతని మనసు అడుగు ముందుకు జరగటంలేదు.

ప్రయాణానికి అటంక మొస్తోందని గ్రహించిన ఆత్మీయులు, అర్జునుడు మణిపురాన్ని పదలలేకపోటానికి గల కారణాలు ఊహించటం ప్రారంభించారు. ధర్మప్రభువైన చిత్రవాహనుడు తమను సాదరంగా ఆహ్వానించి గౌరవించాడు గదా, చిత్రవాహనుని రాజ్యం సుఖశాంతులతో విలసిల్లుతోంది కదా, మరి ఏ కారణం అర్జునుణ్ణి ఇక్కడ నుంచి కదలనీయటం లేదో అర్థం కాక తికమక పడ్డారు అతనితో వచ్చినవారంతా.

మనసులో ఉన్న విషయం ఎవరికి ఎలా చెప్పాలో తెలియక ఆవేదన చెందాడు అర్జునుడు. అయినా చిత్రాంగద పైన అతని మనసు నిలిచిందని గ్రహించటానికి అతని ముఖ్య స్నేహితులకు ఎక్కువ సమయం పట్టలేదు. వారి మనసులు తేలికపడ్డాయి. వారి కొక ఆలోచన తట్టింది. మహారాజుకి అర్జునుడు చిత్రాంగదను ప్రేమిస్తున్న విషయం తెలియపరచాలి, చిత్రాంగదార్జునుల వివాహం జరిపించి గానీ ఇక్కడ నుంచి కదలరాదని నిశ్చయించుకున్నారు స్నేహబృందం.

చిత్రవాహనునికి ఈ వార్త అందింది. అర్జునుడు తనకుమార్తెను ప్రేమిస్తున్నాడనే విషయం అతనికి ఆనందాన్నీ గర్వాన్నీ కూడా కలిగించింది. కానీ మరుక్షణంలో అతని మనసులో ఎన్నో సందేహాలు పొడగట్టాయి. తను తన మనసులో మాటను చెప్తే అర్జునుడు అంగీకరిస్తాడో లేదో, ఒకవేళ అంగీకరించక

తనతో యుద్ధం ప్రకటించో, లేకపోతే చిత్రాంగదను రాక్షస వివాహం చేసుకునో తనతో తీసుకువెళ్ళిపోతే తన గతేంకాను? - చిత్రవాహనుణ్ణి ఈ భావం కదిల్చి వేసింది. కానీ తీర్థయాత్రార్థిగా వచ్చిన అర్జునుడు ఇలాటి పనులు చేయడని మనసును సమాధాన పరుచుకున్నాడు.

చిత్రవాహనుని వంశంలో ప్రభాకరుడనే రాజుకు సంతానం కలగలేదు. ఆ రాజు ఘోరతపస్సు చేసి, శివుని అనుగ్రహంవల్ల ఒక కుమారుని కన్నాడు. అంతేకాదు, ఆ వంశంలో అందరికీ ఒక్కొక్క కొడుకే జన్మిస్తాడని శివుగా వరమిచ్చాడు. అప్పటి నుంచీ తరతరాలుగా ఒక్కొక్క కొడుకే కలుగుతూ వచ్చారు. కానీ, ఆ క్రమం చిత్రవాహనుడి దగ్గర కొచ్చేసరికి మారింది. ఎందుకో తెలియదు కానీ, చిత్రవాహనునికి ఒక్కతే పుత్రిక కలిగింది.

గతాన్ని తల్చుకుంటూ అర్జునునికి ఆ విషయం చెప్పడానికే నిశ్చయించుకున్నాడు చిత్రవాహనుడు.

ఉన్న విషయం చెప్పి, "ఈ పిల్లను పుత్రునిలాగే పెంచాను, రక్షించుకుంటున్నాను" అన్నాడు చిత్రవాహనుడు.

అర్జునుడు మౌనంగా ఉన్నాడు.

"అయ్యా! తమవంటి వీరుడు నాకు అల్లుడు కావటం నా పూర్వజన్మ పుణ్యమే - కానీ, నా వంశానికి ఆధారం చింత్రాంగదకు పుట్టే కుమారుడు! చిత్రాంగదను వివాహమాడి, మీరు ఆమెను మీతో వెంటబెట్టుకుని వెళ్ళిపోతే మీకు జన్మించే కుమారుడు కురువంశ వారసుడైతే, నా రాజ్యానికి వారసు డెవరు? నా వంశానికి ఆధార మెవరు? అదే నా బాధ!" చిత్రవాహనుని గొంతులో గాద్గద్యం వినిపించింది అర్జునునికి.

ద్వారం లోపలి నుంచి తొంగిచూస్తూ, మాటలు వింటున్న చిత్రాంగదను గమనించాడు అర్జునుడు. ఈమెను కుమారునిలాగే పెంచాడు తండ్రి, అందుకే ఆమెలో ఏదో ప్రత్యేకమైన ఆకర్షణ ఉందనిపించింది ఆమెను చూసిన క్షణాన ఆమె ముఖంలో ప్రస్ఫుటంగా వీరత్వం గోచరిస్తుంటే. అర్జునుడు చిత్రవాహనుని కోరిక మన్నించాలని నిశ్చయించుకున్నాడు.

చిత్రాంగదను వివాహమాడటానికీ, వారికి జన్మించే కొడుకు చిత్రవాహనుని వంశాధారంగా ఇక్కడే పెరగటానికీ అర్జునుడు ఒప్పుకున్నాడు.

చిత్రాంగద, అర్జునుల వివాహ సందర్భంగా మణిపురం చిత్రవిచిత్ర అలంకరణలతో దేదీప్యమానంగా వెలిగిపోయింది. మంగళ తూర్య వాయిద్యాల సందడిలో చిత్రాంగదను చేపట్టాడు అర్జునుడు.

చిత్రాంగద ప్రణయ సామ్రాజ్యాధిపతిగా మణిపురంలో సమస్తభోగాలు అనుభవిస్తూ కాలం గడిపాడు అర్జునుడు.

రోజులు క్షణాల్లా గడిచిపోయాయి.

తీర్థయాత్రార్థిగా వచ్చిన తను మణిపురంలోనే ఆగిపోవటం తగదనిపించింది అర్జునునికి. తనతో వచ్చిన వారు ప్రయాణోన్ముఖులౌతుంటే, మణిపురం వదలక తప్పలేదు అర్జునునికి.

తన గర్భాన అర్జునుని పోలిన మహావీరుడు జన్మిస్తాడనే తృప్తితో, ఆనందంతో, సజలనయనాలతో అర్జునునికి వీడ్కోలు చెప్పింది చిత్రాంగద. *

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం : ఆదిపర్వం : అష్టమాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 30-3-1988)